సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



యాత్రాదానం.. సేవాభావం

దాతల సహకారంతో అనాథలు ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించేలా యాత్రాదానంకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది.

8లో



యూరియా కోసం పాట్లు

యూరియా కోసం అవస్థ పడుతున్నా అధికారులు మాత్రం కనికరించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

8లో

గరిష్టం / కనిష్టం

33° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం జల్లులు పడే అవకాశం ఉంది. ఆ తర్వాత సాయంత్రం వరకు మబ్బులు పడతాయి.

న్యూస్‌రీల్

కమనీయంగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారి దేవస్థానంలో బుధవారం స్వామివారి నిత్యకల్యాణ వేడుక కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీసేవగా చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్య కల్యాణంలో భక్తు లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా భద్రగిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్న రామభక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచం ద్ర స్వామివారి దేవస్థానంలో శ్రీరామచంద్రుని జన్మనక్షత్రం (పునర్వసు)ని పురస్కరించుకుని భక్తరామదాసు ట్రస్ట్ (కొత్తగూడెం) నిర్వాహ కుడు కంచర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురు వారం భద్రగిరి ప్రదక్షిణా కార్యక్రమాన్ని వైభ వంగా నిర్వహించారు. రామయ్య కృపాకటాక్షా లకు గిరిప్రదక్షిణనే మార్గంగా ప్రతి నెలా పున ర్వసు రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు గిరిప్రదక్షిణ చేసిన భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించి, ప్రసాదం అంజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రవణ్ కుమార్, సీసీ శ్రీనివాస రెడ్డి, పీఆర్‌ఓ సాయిబాబు, వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు రామభక్తు లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గొత్తికోయల వలసగూడెం ఖాళీ..

అటవీ సిబ్బంది కృషితో అడవిని వీడేందుకు అంగీకారం

చుంచుపల్లి: కొత్తగూడెం డివిజన్ అటవీ సిబ్బం ది సమష్టి కృషితో బుధవారం గొత్తికోయల వలసగూడెం వాసులు స్వచ్ఛందంగా ఖాళీ చేస్తున్నారు. సత్యంపేట బీట్ పరిధిలో 18 కిలోమీటర్ల మేర మాస్ కూంబింగ్–ఫారెస్ట్ మార్చ్ విజయవంతంగా నిర్వహించారు. 2018లో అటవీలో ఏర్పడిన మామిడిగూడెం గొత్తికోయల వలసగూడెంలోని సుమారు 45 కుటుంబాలు దాదాపు 45 ఇళ్లను, పశువుల కొట్టాలను ఏర్పాటు చేసుకున్నాయి. గతేడాది నుంచి నిరంతరంగా జరిగిన సమావేశాల ఫలితంగా చివరికి వారు అటవీ బయటకు వెళ్లేందుకు అంగీకరించారు. అటవీ సిబ్బంది కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా వారంలోగా గ్రామం పూర్తిగా ఖాళీ చేసే అవకాశం ఉందని ఎఫ్‌డీఓ యు.కోటేశ్వరరావు తెలిపారు.

కొత్తగూడెం వాసికి డాక్టరేట్



లక్ష్మీఅనురాధ

కొత్తగూడెంఅర్బన్: పట్టణం లోని ఎస్‌ఆర్ డిజీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచే స్తున్న దోర్బల లక్ష్మీఅనురాధకు ఏపీలోని నాగార్జున యూనివ ర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'పర్సెప్షన్స్ ఆఫ్ పేరెంట్స్ అండ్ టీచర్స్ ఆన్‌ది ఫంక్షనింగ్ ఆఫ్ ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ సెంటర్స్ ఇన్ తెలం గాణ స్టేట్' అనే అంశంపై డాక్టర్ గోగినేని యశోద పర్యవేక్షణలో ఆమె పరిశోధనాపత్రం సమర్పించారు. బుధవారం యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ అందుకు న్నారు. ఈ సందర్భంగా అనురాధను పాఠశాల యాజమాన్యం లక్ష్మణరావు, సతీష్, తిరుమల్ రెడ్డి, రామారావు అభినందించారు.

అన్ని రంగాల్లో అగ్రగామి



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాపాలనలో ప్రజల ఆకాంక్షకే ప్రాధాన్యం

- అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసమే కులగణన
- తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో మంత్రి తుమ్మల

సూపర్‌బజార్(కొత్తగూడెం): అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి పథంలో పయనిస్తోందని, ప్రధానంగా ఖనిజసంపద, విద్య, వైద్య, వ్యవసాయ రంగాల లో అగ్రగామిగా ఉందని రాష్ట్ర వ్యవసాయ, సహ కార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాతీయపతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిం చారు. మొదట సింగరేణి అతిథి గృహంలో మం త్రికి కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు పూలమొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో కలిసిన చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. స్వాతం త్ర్య సమరయోధులు, అమరవీరులు, ప్రజాపో రాట యోధుల త్యాగాల వల్లే నేడు ప్రజాస్వామ్య విలువలు స్థిరపడ్డాయని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం అంటే ప్రజలేపాలకులని, ప్రజలే అధిపతులు అనే స్ఫూర్తిని ప్రజాపాలన దినోత్సవం గుర్తు చేస్తోందని అన్నారు. విద్యుత్, నీటిపారుదల, వ్యవసాయం, పరిశ్రమలు, ఐటీ, ఉపాధి, సంక్షేమ రంగాలలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలతో రైతు సం క్షేమానికి తెలంగాణ కేరాఫ్‌గా నిలిచిందని అన్నారు. సీతారామ ప్రాజెక్టు కల నెరవేరిందని, దేశంలోనే తొలిసారిగా జిల్లాలో ఎర్త్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకున్నామని వివరించారు. భద్రాచలం రైల్వే లైన్‌కు సంబంధించిన పనులు వేగవంతంగా జరు గుతున్నాయని అన్నారు. అడ్డంకులను తొలగించి కలెక్టర్ సూచించిన ప్రాంతంలో విమానాశ్రయం నిర్మిస్తామని తెలిపారు. రింగ్‌రోడ్డు, బైపాస్‌రోడ్డు, నేషనల్‌హైవే పనులు కూడా పురోగతిలో ఉన్నా యని వివరించారు. సింగరేణి సంస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రైతులు మిర్చి, పత్తి వంటి పంటలను తగ్గించి లాభదాయక మైన ఉద్యాన పంటల వేయాలని సూచించారు. దేశంలోనే జిల్లా ఆయిల్‌పామ్ హబ్‌గా మారుతుం దని అన్నారు. ఇతర రాష్ట్రాల మంత్రులు జిల్లాలో జరుగుతున్న ఆయిల్‌పామ్ సాగు గురించి తెలుసు కుంటున్నారని వివరించారు. సిద్దిపేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసమే కులగణన చేప ట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచ లం, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు తెల్లం వెంక ట్రావు, జారే ఆదినారాయణ, ఐటీడీఏ పీఓ రాహుల్, జిల్లా అటవీశాఖాధికారి కృష్ణాగౌడ్, అద నపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి

కలెక్టరేట్‌లో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుక లను నిర్వహించారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు హాజరై విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. నాయకులు కొత్వాల శ్రీనివాసరావు, నాగ సీతారాములు, కాపర్తి వెంక టాచారి, వారాధి సత్యనారాయణ, బసవపాత్రుని తిరుపతి, వారాధి రామాచారి, బి.సాంబయ్య, ఎస్.కృష్ణమాచారి, కూరపాటి లింగాచారి, పి.వెంక టాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు పాలన చేరువ..

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చుంచుపల్లి: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం వేడుకలు ఘనం గా నిర్వహించారు. కలెక్టర్, జిల్లా ప్రజాపరిషత్ ప్రత్యేకాధికారి జితేష్ వి.పాటిల్ జాతీయ జెం డా ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకుంటోందన్నారు. 1948లో ఈ రోజే నిజాం పాలన ముగిసి, హైదరాబాద్ రాష్ట్రం భారత దేశంలో విలీన మైందన్నారు. ఈ దినోత్సవం ద్వారా ప్రజాపా లన ప్రజల కోసం అనే సంకల్పాన్ని గుర్తు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ బి.నాగలక్ష్మి, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ సూపరింటెండెంట్లు కె.అరుణ, వి.బి.వి.కె ప్రసాద్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజాపాలన'తో సమానత్వం, న్యాయం

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: ప్రజాభిప్రాయాలు, ఆకాంక్ష లు, సమస్యలను గుర్తించి సరైన పరిష్కారం చూపి, సమాజాన్ని సమానత్వం, న్యాయం అభి వృద్ధి దిశగా నడిపించడమే ప్రజాపాలన ఉద్దేశ మని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. తెలం గాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఐటీ డీఏ ఆవరణలో ఏర్పాటు చేసిన పతాకావిష్కరణ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొ న్నారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించి పతాక ఆవిష్కరించి జాతీయ గీతం, తెలంగాణ గీతం ఆలపించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ సెప్టెంబర్ 17తో నాటి హైద రాబాద్ సంస్థానం భారతదేశంలో ఐక్యమై 77 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. గిరిజను లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు డేవిడ్ రాజ్, మణెమ్మ, సున్నం రాంబాబు, భాస్కరన్, హరీష్, ఉదయ్ కుమార్, అశోక్ కుమార్, ఆది నారాయణ, ప్రభాకర్ రావు, హరికృష్ణ, చలపతి, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

మరో సర్వేకు అడుగులు

- ఎయిర్‌పోర్టు కోసం పట్టువిడవకుండా ప్రయత్నిస్తున్న మంత్రి తుమ్మల
- కొత్తగూడెంలో ఎదురవుతున్న సాంకేతిక చిక్కులు
- కొత్తగూడెం–భద్రాచలం మధ్య కొత్త స్థలాల పరిశీలన



భూమిని సర్వే చేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్రంలో కాం గ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరంగల్‌తోపాటు కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్, నిజామాబాద్‌లలో కొత్త ఎయిర్‌పో ర్టుల నిర్మాణం కోసం ప్రయత్నాలు మొదలెట్టింది. కొత్తగూడెంలో నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు లో చిన్న విమానాలతోపాటు ఎయిర్‌బస్ వంటి భారీ విమానాలు ల్యాండింగ్, టేకాఫ్ తీసుకునేం దుకు వీలుగా మూడు కిలోమీటర్ల పొడవైన రన్‌వే నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం 950 ఎక రాల భూమి అవసరమని భావించారు. కొత్తగూడెం మండల పరిధిలోని రామవరం, గరీబ్‌పేట శివారు లలో 707, సుజాతనగర్ మండల పరిధిలో 195, చుంచుపల్లి మండల పరిధిలో 50 ఎకరాల స్థలాలను కూడా గుర్తించారు. ఇక్కడున్న ఎత్తైన గుట్టలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడ్డంకిగా నిలిచాయి. మరోవైపు వరంగల్, ఆదిలాబాద్ ఎయి ర్‌పోర్టుల విషయంలో సానుకూల ఫలితాలు వచ్చి క్షేత్రస్థాయిలో పనులు మొదలయ్యాయి. దీంతో సెప్టెంబరు 16న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి ఢిల్లీకి వెళ్లి కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడికి కొత్తగూడెం ఎయిర్ పోర్టు కోసం విజ్ఞప్తి చేయగా.. మరోసారి ఫీజుబ ులిటీ సర్వేకు అడుగులు పడ్డాయి.

ఇరవై ఏళ్లుగా అదే సమస్య

కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ నిర్మించాలనే అంశంపై దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్న ప్పటి నుంచీ ప్రయత్నాలు జరుగుతున్నాయి. సరైన స్థలాన్ని ఎంపిక చేయడమే సవాల్‌గా మారింది. భవిష్యత్‌లో బోయింగ్ విమానాలు దిగేందుకు వీలుగా వెయ్యి ఎకరాల్లో ఎయిర్‌పోర్టు కోసం సుజాతనగర్ ప్రాంతంలో భూములు వెతికారు. అయితే అది సాధ్యపడలేదు. చివరకు ఎయిర్‌కార్గో సేవల కోసం ప్రయత్నాలు చేసినా అవి ముందుకు సాగలేదు. తెలంగాణ వచ్చిన తర్వాత ముందుగా లక్ష్మీదేవిపల్లి మండలం పునుకుడుచెలక ఆ తర్వాత పాల్వంచ మండలం గుడిపాడు – బంగారుజాలల మధ్య ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం పలుమార్లు సర్వేలు జరిగాయి. పాల్వంచ పట్టణాన్ని అనుకుని ఉన్న ఎత్తైన గుట్టలు, కేటీపీఎస్ చిమ్నీలు, కూలింగ్ టవర్ల వల్ల సాంకేతిక ఇబ్బందులు రావడంతో ఈ ప్రతిపాదన అక్కడే ఆగిపోయింది.

కొత్తగూడెం – భద్రాచలం మధ్య..

ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం సుజాతనగర్, చుంచు పల్లి, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం, పాల్వంచ మండ లాల్లో ఎన్నిసార్లు స్థలాలను గుర్తించినా ఎత్తైన కొండ లు, అభయారణ్యం, హై టెన్షన్ కరెంటు లైన్లు, రైల్వే మార్గాలు, నేల స్వభావం, గాలుల తీవ్రత, నీటి ప్రవాహాలు వంటి భౌగోళిక, సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఈ మండలాలను మిన హాయించి భద్రాచలం – కొత్తగూడెం మధ్య ఎయిర్ పోర్టు నిర్మాణానికి అనువుగా ఉన్న స్థలాలను పరిశీల నలోకి తీసుకునే అవకాశం ఉంది. త్వరలో జరగ బోయే ఫీజుబులిటీ సర్వేకు సైతం ఇక్కడే స్థలాలను చూపించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు సమా చారం. ఈ మేరకు రెండు మూడు చోట్ల స్థలాలను గుర్తించగా, ఇందులో ఒక స్థలాన్ని ఎయిర్‌పోర్టు కోసం ఫైనల్ చేయనున్నట్టు సమాచారం.

ఎంతో ఉపయుక్తం

జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచ లం రామాలయం దేశ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెం దింది. ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే దేశం నలుమూలల నుంచి భద్రాచలం క్షేత్రానికి భక్తులు వచ్చే అవకాశం ఉంది. సింగరేణి గనులు, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ, కేటీపీఎస్, బీటీపీఎస్ వంటి పరిశ్రమలు ఉన్నాయి. కొత్తగా మెడికల్ కాలేజీ, డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ జిల్లాలో ఏర్పాటైంది. దేశం మొత్తం మీద ఎర్త్ సైన్సె స్ విభాగంలో ప్రత్యేక కోర్సులు అందిస్తున్న వర్సిటీ గా ఇది నిలిచింది. త్వరలోనే సేంద్రియ సాగు విధా నానికి సంబంధించి ఎక్సలెన్స్ సెంటర్ కూడా జిల్లాకు రానుంది. మరోవైపు అడవులు విస్తారంగా ఉండటంతో ఎకో టూరిజానికి ఈ ప్రాంతం అనువు గా ఉంది. ఇప్పటికే ఎకో టూరిజంలో ప్రసిద్ధి చెందిన మారేడుమిల్లి, పాపికొండలు, సీలేరు – పొల్లూరు వాటర్‌ఫాల్స్ వంటి ప్రదేశాలకు వెళ్లేందుకు భద్రాచ లం గేట్‌వేగా ఉంది. ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఆధ్యాత్మిక, పారిశ్రామిక, పర్యాటక రంగాలు ఈ ప్రాంతంలో పుంజుకుంటాయి. సరికొత్త ఉపాధి అవకాశాలు వచ్చేందుకు ఆస్కారముంది.

ఉన్నత లక్ష్యాలతో రాణించాలి



ములకలపల్లి మండలం మూకమామిడి ఏకలవ్య పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట/ములకలపల్లి : ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో రాణించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బుధవారం ఆయన ములకలపల్లి, దమ్మపేట మండ లాల్లో పర్యటించారు. దమ్మపేట మండలం గండుగు లపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన డార్మెటరీ భవనాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంత్రి ప్రారంభిం చారు. అదే పాఠశాలలో రూ.8 కోట్ల 60 లక్షలతో నిర్మించనున్న బాలుర హాస్టల్, ఉద్యోగుల క్వార్టర్ల భవనాల శంకుస్థాపన నిమిత్తం ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. అద్వంట విత్తన కంపెనీ ఆర్థికసాయంతో రూ.46 లక్షలతో నిర్మించిన కంప్యూ టర్ ల్యాబ్‌ను, రూ.21 లక్షలతో గండుగులపల్లిలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. ములకలపల్లి మండలం మూకమామిడి ఏకలవ్య పాఠశాలలో ఏర్పాటు చేసిన 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' శిబిరంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి తుమ్మల మధ్యాహ్న భోజనం చేశారు. తొలుత స్థానిక మంగ పేట పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ ఉత్తమ ఫలితాలు సాధించి, దేశంలోని ఏక లవ్య పాఠశాలలకు ఆదర్శంగా నిలవాలని విద్యా ర్థినులకు సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఏర్పాటు చేయాలని వైద్య శాఖాధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్‌లతోపాటు, శాస్త్రవేత్త లుగా కూడా ఎదగాలని, ప్రధానంగా భూ, జల, వ్యవసాయ రంగాల్లో రాణించాలని సూచించారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ద్వారా విద్యార్థులకు అద్భుత అవకాశాలు దక్కు తాయన్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ దసరా సెలవుల్లోగా అన్ని పాఠశాలల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాల న్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు చేస్తున్న త్యాగాలను గుర్తు చేసుకోవాలని సూచించారు. ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళలదే ప్రధాన పాత్ర పేర్కొన్నారు. ఐటీడీఏ పీఓ గౌతమ్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంక ట్రావు, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీఆర్‌డీఓ విద్యాచం దన, డీఎంఅండ్‌హెచ్‌ఓ జయలక్ష్మి, తహసీల్దార్ గనియా నాయక్, ఎంపీడీఓ రామారావు, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, తాండ్ర ప్రభాకర్ రావు, పర్వతనేని అమర్‌నాథ్, పువ్వాల మంగపతి, కరుటూరి కృష్ణ, అడపా నాగేశ్వరరావు, బాల అప్పా రావు, కారం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మతాల మధ్య చిచ్చుకు కుట్ర

- సాయుధ రైతాంగ పోరాటానికి మతం రంగు పులుముతారా..?
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ



సభలో మాట్లాడుతున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి బేబీ, పక్కన తమ్మినేని తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ వంటి శక్తులు మత పర మైన రంగు పులుముతున్నాయని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ విమర్శించారు. నగ రంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో బుధవారం రాత్రి జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఈ పోరాటంలో శ్రామికులు, కార్మికు లు, రైతులు భాగస్వాములయ్యారని, మహిళల భాగస్వామ్యం కూడా గొప్పదని అన్నారు. తెలం గాణ సాయుధ పోరులో అనేక మంది ప్రాణత్యాగం చేశారని నివాళులర్పించారు. దున్నేవాడికే భూమి కావాలని భూ స్వాములకు ఎదురొడ్డి పోరాటం సాగిందని, దీని ఫలితంగానే లక్షలాది ఎకరాల భూములు పేదలకు పంచారని తెలిపారు. అయితే కేంద్రంలోని నేటి పాలకులు ఈ పోరాటానికి మతం రంగు పులుముతూ ముస్లింలకు వ్యతిరేకం గా ప్రచారం చేస్తూ మతాల మధ్య చిచ్చు పెడుతు న్నారని ఆరోపించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యు లు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం భావి తరాలకు స్ఫూర్తిదాయక మని అన్నారు. దీన్ని ముస్లింలకు – హిందువులకు మధ్య జరిగిన పోరాటమని కొందరు వక్రీకరిస్తూ విమోచన, విలీనం, విద్రోహం అనే పేర్లతో తప్పు దోవ పట్టిస్తున్నారని విమర్శించారు. హక్కులు, వెట్టి చాకిరీ నుంచి విముక్తి, అత్యాచారాల నిరోధం తో పాటు దున్నే వాడిదే భూమి నినాదంతో తెలం గాణ సాయుధ పోరాటం సాగిందని తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్ష తన జరిగిన ఈ సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యు లు పోతినేని సుదర్శన్, నాయకులు బండి రమేష్, పొన్నం వెంకటేశ్వరరావు, కల్యాణం వెంకటేశ్వర రావు, వై.విక్రం, ఎం. సుబ్బారావు, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధే ప్రథమ ప్రాధాన్యం

- భక్తులకు సర్వ దర్శనం, వసతి సౌకర్యాలపై దృష్టి
- మాస్టర్ ప్లాన్, పుష్కరాలపై ముందస్తు ప్రణాళికలు
- సాక్షి ఇంటర్వ్యూలో రామాలయ ఈఓ కొల్లు దామోదర్ రావు



కొల్లు దామోదర్‌రావు

స్వామివారి భూములను కాపాడుకుంటాం

రాముడికి చెందిన భూములను చట్ట ప్రకారం కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తాం. ప్రధానంగా ఏపీలోని పురుషోత్తపట్నంలో రాముడి భూములు దేవస్థానానికి చెందే లా అన్ని పత్రాలు ఉన్నాయి. దీనిపై ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలించాం. వీటిని న్యాయపరంగానే దక్కించుకుంటాం. ఏపీలోని అన్ని శాఖల సహాయ సహ కారాలతో ఈ భూములపై పోరాడుతాం. ఇతర ప్రాంతాలలో ఉన్న భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం. భక్తులకు సేవ చేసేందుకు రామయ్య కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా.

భద్రాచలం: భద్రాద్రి రామయ్య చెం తకు వచ్చే భక్తులకు ప్రశాంత దర్శనం, సకల సౌకర్యాల కల్పన, దేవస్థానం అభివృద్ధే ప్రాధాన్యతగా విధులు నిర్వర్తిస్తానని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం కార్యనిర్వహ ణాధికారి కొల్లు దామోదర్‌రావు తెలిపారు. ఇటీవల ఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధ వారం 'సాక్షి' ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

భక్తులకు సౌకర్యాల కల్పన

భద్రాచలం ఆర్డీఓగా పనిచేసి ఉండటంతో భద్రాచ లం, దేవస్థానంపై అవగాహన ఏర్పడింది. దీం తోపాటు ఆలయ అభివృద్ధిలో కీలకమైన మాఢ వీధుల విస్తరణలో భూ సేకరణ చేసి నిర్వాసితులకు నష్టపరిహారం అందజేశాం. ఇప్పుడు ఆలయ ఈఓగా అదే అభివృద్ధిని కొనసాగించేందుకు కృషి చేస్తా. ఇప్పటికే భక్తులకు అందుతున్న ఆన్‌లైన్ సౌక ర్యాలను ఇతర విభాగాలకూ విస్తరించేలా ప్రయత్నా లు చేస్తున్నాం. ఇక ప్రధానంగా రామాలయంలో నిర్వహించే సేవలు, ఆలయ ప్రాశస్త్యంపై ప్రచార లోపం ఉం దనే అపోహలు తొల గించేందుకు ఆ సేవలు, ఇతర హోర్డింగ్‌లను భద్రాచ లంతోపాటు మారుమూల ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. రంగనాయకుల గుట్టపై నిరుపయోగంగా ఉన్న టీటీడీ, అన్నవరం సత్రాలను పూర్తిగా తొలగించి ఉన్నతాధికారుల సూచనల మేరకు భక్తులకు వసతి సౌకర్యాలు కల్పిం చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రామా లయం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తొలగించి క్లీన్ భద్రగిరిగా ఉంచేందుకు కృషి చేస్తా.

మాస్టర్ ప్లాన్, గోదావరి పుష్కరాలు..

ఇక ప్రభుత్వం సంకల్పించిన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధిలో నా వంతు పాత్ర పోషిస్తా. ప్రధానంగా ఆలయం, ఉపాలయాల అభి వృద్ధి, మార్పులు, చేర్పులపై ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ పండితులు, వైదిక కమిటీలతో సమ న్వయం చేసుకుంటూ వారి సలహాలు, సూచనల మేరకు ముందుకెళ్తాం. ఈ మేరకు ఇప్పటికే వారితో సంప్రదింపులు జరుపుతున్నాం. చర్చలు ముగిశాక కలెక్టర్, ఇతరులతో కలిసి తగిన నివేదిక రూపొం దించి ప్రభుత్వానికి అందిస్తాం. ఆలయ అభివృ ద్ధితోపాటు భక్తులకు సౌకర్యాల కల్పనే ప్రధాన అజెండాగా పని చేస్తాం. 2027 గోదావరి పుష్క రాలకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం. గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భక్తుల రద్దీని తట్టుకునేందుకు తాత్కాలిక వెయిటింగ్ గదులు ఏర్పాటు చేస్తాం. ఇందుకోసం మిథిలా స్టేడియం, ఇతర ప్రాం తాలను పరిశీలిస్తున్నాం. భక్తులకు సరిపడా లడ్డూ లు, వీఐపీలకు ఇతర సేవలను దృష్టిలో ఉంచుకుని అధికారులు, సిబ్బంది సహాయ సహకారాలతో ఏర్పాట్లు చేసేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తాం.

స్వచ్ఛతా హీ సేవా పోస్టర్ ఆవిష్కరణ

చుంచుపల్లి: స్వచ్ఛతా హీ సేవా–2025 పోస్టర్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ బుధవారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతపై కార్యక్రమా లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలో స్వచ్ఛ శ్రామికులకు ఆరోగ్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. స్వచ్ఛత ర్యాలీలు, సైకిల్ యాత్రలు చేపట్టాలని సూచిం చారు. విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాసరచన, నాటక, ఇతర పోటీలు నిర్వహించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎం.విద్యాచందన, సిబ్బంది రేవతి, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యా విధానంతో సులభంగా నేర్చుకోవచ్చు

సూపర్‌బజార్(కొత్తగూడెం): డిజిటల్ విద్యావిధా నంతో విద్యార్థులు సులభంగా నేర్చుకోవచ్చని కలె క్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో బుధవారం ఎనిమిది ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, రెండు భవిత సెంటర్ల ఐఈఆర్‌పీలకు సీఎస్‌ఆర్ పాలసీ ద్వారా హైద రాబాద్‌కు చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ యాజమాన్యం క్యాన్ ప్రాజెక్టర్ (డిజిటల్ బోధనా పరికరాలు)లను కలెక్టర్ చేతుల మీదుగా అందజే సింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో రూ.25 లక్షల విలువైన బోధనా పరికరాలను అందజేసినందుకు అభినందనలు తెలిపారు. రానున్న కాలంలో జిల్లాలో 250 పాఠశాలలకు కూడా మంజూరు చేయాలని ప్రతిపాదించామని తెలిపారు. బీఈఎల్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, డీఈఓ బి.నాగలక్ష్మి, విద్యాశాఖ కోఆర్డినేటర్లు సతీష్‌కుమార్, సైదులు, నాగరాజశేఖర్, బీఈఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

క్లుప్తంగా

'ఇందిరమ్మ' లబ్ధిదారులకు అదనపు చెల్లింపులు

చంద్రుగొండ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తొలి విడత బిల్లుల చెల్లింపుల తర్వాత అదనంగా మరోసారి నగదు జమ చేసిన ఘటన బుధవారం చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో వెలుగు చూసింది. ఆలస్యంగా దీనిని గుర్తించిన అధికారులు లబ్ధిదారుల వద్ద నుంచి వాటిని రికవరీ చేసేందుకు యత్నిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. చంద్రుగొండ మండలానికి చెందిన ఎస్‌డీ ఇమాంబీ, సిరికొండ స్వామి, గంగారపు సుబ్బమ్మ, కునసోతు జయ, పొట్టా భవానీ, బండ ఉషారాణి, కంచర్ల తిరుమలి, ఇనుముల లక్ష్మి, కుక్కముడి రాణి, గోసుల నర్సింహారావు, సీతమ్మ, జాల పద్మకు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఈ నెల 11వ తేదీన వారి బ్యాంక్ ఖాతాల్లో రూ.లక్ష చొప్పున నగదు జమ అయింది. కాగా, వారికి అదనంగా మరోసారి ఈ నెల 15న బ్యాంక్ ఖాతాల్లో రూ.లక్ష చొప్పున జమ కావడం గమనార్హం. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన అధికారులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి అదనంగా నగదు చెల్లింపులు జరిగాయని, ఆ నగదును తిరిగి ప్రభుత్వానికి జమ చేయాల్సిందిగా స్థానిక గృహ నిర్మాణ శాఖ అధికారులు కోరుతున్నారు. కాగా, చంద్రుగొండ మండలంతో పాటు అన్నపురెడ్డిపల్లి మండలం, జిల్లాలోని మరికొన్ని మండలాల్లో కుడా ఇలాగే జరిగినట్లు తెలిసింది.

టెన్నిస్ కోర్టు ప్రారంభం



టెన్నిస్ కోర్టును ప్రారంభిస్తున్న పీఓ రాహుల్, తదితరులు

భద్రాచలంటౌన్: ఉద్యోగులకు టెన్నిస్ క్రీడలు ఎంతో మేలు చేస్తాయని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలోని నివాస సముదాయంలలో కొత్తగా నిర్మించిన లాన్ టెన్నిస్ కోర్టును పీఓ బుధవారం ప్రారంభించి, మాట్లాడారు. టెన్నిస్ ఆడితే వ్యాయామంతో పాటు మనసుకు ఎంతో ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. క్రమం తప్పకుండా ఉద్యోగులు తమ పిల్లలు గంట పాటు టెన్నిస్ ఆడాలని సూచించారు. చెత్తా చెదారాన్ని మైదానంలో వేయొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, అలివేలు మంగతాయారు, గోపాల్‌రావు, నాగేశ్వరరావు, ఆదినారాయణ, పీడీలు వెంకటేశ్వర్లు, హరికృష్ణ ఈశ్వర్,వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శక శక్తిగా పనిచేస్తాయి..



గౌరవ వందనం సమర్పిస్తున్న కేడెట్లు

అశ్వాపురం: ఎన్‌సీసీ శిబిరంలో పొందిన శిక్షణ, అనుభవాలు వారి భవిష్యత్ ప్రయత్నాల్లో మార్గదర్శక శక్తిగా పనిచేస్తాయని ఐటీడీఏ పీఓ రాహుల్, వరంగల్ గ్రూప్ కమాండర్ వీరచక్ర కల్నల్ సచిన్ అన్నారు. మండల పరిధిలోని మిట్టగూడెంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో పది రోజులుగా జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఐటీడీఏ పీఓ, వరంగల్ గ్రూప్ కమాండర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేడెట్లు దేశభక్తి గీతాలు, తెలంగాణ సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాహుల్, సచిన్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ శిక్షణలో పొందిన అనుభవాలు నాయకత్వం, దేశభక్తి, బాధ్యతను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సంజయ్‌భద్ర, కళాశాల ప్రిన్సిపాల్ రవి బండారుపల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



భావ్‌సింగ్ (ఫైల్)


చంద్రుగొండ: మండలంలోని రావికంపాడు గ్రామానికి చెందిన బొర్రా భావ్ సింగ్ కనిపించకుండా పోగా.. బుధవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు. 70 ఏళ్ల వయసున్న భావ్‌సింగ్ మంగళవారం మండలంలోని టేకులపల్లిలో ఉన్న తన కుమార్తెను చూసి వస్తానని వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఆరా తీయగా, ఆయన అక్కడకు రాలేదని చెప్పారు. భావ్‌సింగ్ ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ నంబర్ 87126 82043కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

జూలూరుపాడు: మండలంలోని మాచినేనిపేటతండాలోని ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రవి కథనం ప్రకారం.. మాచినేనిపేటతండాకు చెందిన బీరేల్లి సుధాకర్ ఈనెల 16న ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం ఇంటికి వచ్చి చూడగా.. చోరీ జరిగిందని గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ శ్రీలక్ష్మి.. సిబ్బంది, క్లూస్ టీంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేశారు. మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.12 వేల విలువ చేసే వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రవి తెలిపారు.

యాత్రాదానం.. సేవాభావం

- వినూత్న కార్యక్రమానికి ఆర్టీసీ శ్రీకారం
- పేదలు, అనాథలను యాత్రలకు తీసుకెళ్లేలా కార్యాచరణ
- దాతలు ముందుకొస్తే బస్సుల కేటాయింపు



ఆర్టీసీ 'యాత్రాదానం'పోస్టర్



సత్తుపల్లి డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు వెళ్లిన భక్తులతో అధికారులు (ఫైల్)

సత్తుపల్లిటౌన్: పుణ్యక్షేత్రాలు, పర్యాటక, విజ్ఞాన విహార యాత్రలను సందర్శించాలనే కోరిక ఎంతో మందికి ఉంటుంది. కానీ, పేదరికం వల్ల ఆ కల నెరవేర్చుకోలేని పరిస్థితి ఉంటుంది. అలాంటి వారి కోసం ఆర్టీసీ యాజమాన్యం వినూత్నంగా 'యాత్రాదానం'కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు పలు యాత్రలు, ఆధ్యాత్మిక ప్రాంతాలకు ప్రత్యేకబస్సులు నడుపుతున్న ఆర్టీసీ యాత్రాదానం పేరిట ఆదాయాన్ని ఆర్జించేందుకు నూతన కార్యక్రమాన్ని చేపట్టింది. ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలను దాతల సహకారంతో అనాథలు, పేదలు సందర్శించేలా ఈ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

వీరికి అవకాశం కల్పించేలా..

జిల్లాలోని అనాథలు, ఆశ్రమాలలోని వృద్ధులు, దివ్యాంగులు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో చదివే పేద విద్యార్థులకు ఆర్టీసీ 'యాత్రాదానం'తో పర్యాటక, పుణ్య క్షేత్రాల సందర్శనకు తీసుకెళ్తారు. అందుకోసం రీజియన్‌లోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు డిపోల పరిధిలో డిపోమేనేజర్ల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు.

దాతల చేయూతతో..

పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర ప్రత్యేక రోజులు, పండుగలు తదితర సందర్భాలు, సంతోషకరమైన రోజుల్లో అన్నదానం, రక్తదానం, నేత్రదానం, అవయవదానం ఎక్కువగా చేస్తుంటారు. ఈసందర్భాలలో అనాథలు, వృద్ధులు, దివ్యాంగులు, పేద విద్యార్థులకు పుణ్యక్షేత్రాల దర్శనం కల్పించటానికి ఆర్టీసీకి డబ్బులు విరాళంగా అందజేస్తే బస్సు సదుపాయం కల్పిస్తారు. అలాంటి దాతలు, సంస్థల సేవలను వినియోగించుకునేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ఎన్‌ఆర్‌ఐలతో పాటు కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు ముందుకు వచ్చి ఆర్టీసీ 'యాత్రాదానం'లో భాగస్వాములు కావొచ్చు.

మిత్రుల భాగస్వామ్యంతోనైనా..

యాత్రాదానం కార్యక్రమంలో దాతలు ఆధ్యాత్మిక సంతృప్తితో పాటు సామాజిక సేవ చేశామనే ఆనందం పొందవచ్చు. దాతలు ఏ పుణ్యక్షేత్రానికి యాత్రాదానం చేయదల్చుకున్నారో వివరాలతో డిపో మేనేజర్లను సంప్రదించాలి. యాత్రకు సంబంధించి కిలోమీటర్లను లెక్కించి దాని ప్రాతిపదికన ఏసీ, సూపర్‌లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సుల చార్జీలు వెల్లడిస్తారు. ఆపై బస్సులను ఎంచుకుంటే డిపోల నుంచి కేటాయిస్తారు. యాత్రకు సంబంధించి నగదును ఒకరైనా.. ఇంకొందరితో కలిపైనా చెల్లించవచ్చు.

పుణ్యక్షేత్రాలతో..

ఖమ్మం రీజియన్‌లో ఏడు డిపోలకు గాను మొత్తం 563 బస్సులు ఉన్నాయి. గతంలో జూన్ నుంచి పుణ్యక్షేత్రాలు, యాత్రల పేరిట అరుణాచలం తదితర ప్రాంతాలకు ప్రత్యేకరోజుల్లో బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. రీజియన్ నుంచి 42 బస్సులు నడపగా 25,682 మంది భక్తులు ఉపయోగించుకున్నారు. తద్వారా రీజియన్‌కు రూ.17,03,668 ఆదాయం లభించింది.

సేవాభావంతో ముందుకు రండి..



సేవాభావంతో ప్రజాప్రతినిధులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు ఎవరైనా ముందుకు వచ్చి యాత్రాదానానికి సహకరించవచ్చు. సామాజిక సేవలో భాగంగా విరాళాలు ఇస్తే పేదలు పుణ్యక్షేత్రాలు, విజ్ఞాన, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సుల్లో సందర్శించే అవకాశం లభిస్తుంది. వారం రోజులు ముందుగానే బస్సును బుక్ చేసుకోవాలి. –ఎ.సరిరామ్, ఆర్టీసీ ఆర్‌ఎం, ఖమ్మం

పంట నిల్వ ప్రాజెక్టులకు రాయితీలు

ఖమ్మంవ్యవసాయం: పంటల నిల్వ, రవాణా, ప్రాసెసింగ్ చేయడం వంటి ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. 2025–26 వార్షిక ప్రణాళికలో భాగంగా ఉద్యాన రైతులకు ఈ మేరకు ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించింది. దేశంలో రైతులు పండించిన పంటల్లో 20–30 శాతం వరకు తగిన నిర్వహణ లేక నాణ్యత కోల్పోయి మద్దతు ధర దక్కడం లేదు. ఉద్యాన పంటల్లో ప్రధానంగా పండ్లు కోత తరువాత శీతలీకరించడం, గ్రేడ్ చేయడం, ప్యాకింగ్, రవాణా, ప్రాసెసింగ్ వంటి విధానాలు అవలంభించడం ద్వారా విలువ పెరగడంతో పాటు ప్రత్యేక మార్కెటింగ్ చానల్ ద్వారా అమ్మకాల కు అవకాశం ఉంటుంది. తద్వారా రైతుల ఆదాయం పెరగడమే కాక వినియోగదారులకు నాణ్యమైన పండ్లు లభిస్తాయి. జిల్లాలో పండ్లతోటలు పెంచే రైతుల కు ఏడు ప్యాక్ హౌస్ యూనిట్లు, రెండు కోల్డ్ స్టోరేజీ యూనిట్లు, ఒక రైపనింగ్ చాంబర్, 15సోలార్ ప్యానెల్ యూనిట్లు మంజూరయ్యాయని జిల్లా ఉద్యానాధికారి ఎం.మధుసూదన్ తెలిపారు. ఈ ప్రాజెక్టుల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉద్యాన పథకాలు, రాయితీల వివరాలు(రూ.లలో)

పథకం పేరు	రాయితీ శాతం	పూర్తి ధర	ప్రభుత్వ రాయితీ
ప్యాక్ హౌస్	50	4 లక్షలు	2 లక్షలు
ఇంటిగ్రేటెడ్ ప్యాక్‌హౌస్	35	1.60 కోట్లు	56 లక్షలు
సోలార్ ప్యానళ్లు	35	35 లక్షలు	12.25 లక్షలు
రైపనింగ్ చాంబర్	35	కోటి	35 లక్షలు
కోల్డ్ స్టోరేజీ	35	4.80 కోట్లు	1.68 కోట్లు



ఆగి ఉన్న లారీని ఢీకొన్న లారీ

చర్ల: చర్ల – వెంకటాపురం ప్రధాన రహదారిపై ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని సీ–కత్తిగూడెంలో ప్రధాన రహదారిపై ఇసుక లారీ నిలిపి ఉంది. వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీడ్రైవర్‌కు తీవ్ర గాయాలవగా, లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బ తిన్నది. స్థానికులు గమనించి, గాయపడిన డ్రైవర్‌ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అటవీ శాఖకు నూతన హంగులు

నేడు రూ.90 కోట్ల పనులు ప్రారంభం



పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అటవీ అమరవీరుల స్తూపం, పోడియం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి అటవీశాఖకు జిల్లా కేంద్రం తరహాలో నూతనహంగులు రానున్నాయి. టింబర్ డిపోప్రాంగణంలోని స్థలాన్నిపరేడ్‌గ్రౌండ్‌గా తీర్చిదిద్దారు. ఇందులోరూ.2లక్షలతో అటవీ అమరవీరుల స్తూపం, రూ.4 లక్షలతో పోడియం ఏర్పాటు చేశారు. డివిజన్‌స్థాయిలో ఉద్యోగులకు శిక్షణ, సమావేశాల నిర్వహణకోసం రూ.12 లక్షలతో మీటింగ్‌హాల్ నిర్మించారు.

నీలాద్రి అర్బన్ పార్కులో..

సందర్శకుల ఆదరణ పెరుగుతున్న నీలాద్రి అర్బన్ పార్కుకు రూ.10 లక్షలతో మారో రెండు బ్యాటరీ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. అర్బన్ పార్కులోని వన్యప్రాణులు బయటకు రాకుండా.. వీధి కుక్కలు లోపలికి చొరబడకుండా కన్జర్వేషన్ జోన్ ఏర్పాటు చేశారు. రూ.50 లక్షలతో 1.5 కిలో మీటర్ల మేర చైన్‌లింగ్ ఫెన్సింగ్‌తో రక్షణ చర్యలు చేపట్టారు. పనులను ఎమ్మెల్యే రాగమయితో కలిసి మంత్రి తుమ్మల ప్రారంభిస్తారు.

పాఠశాల ప్రారంభం



గొత్తికోయ గుంపులో ఎంఈఓ, ఉపాధ్యాయులు

అన్నపురెడ్డిపల్లి, (చంద్రుగొండ): మండలంలోని కనకగిరి గుట్టల ప్రాంతంలో ఉన్న రజబ్‌అలీనగర్‌లో గిరిపుత్రుల కోసం ఏర్పాటు చేసిన పాఠశాలను బుధవారం ఎంఈఓ ఉండేటి అనంద్‌కుమార్ ప్రారంభించారు. మహబూబ్‌నగర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల రజబ్‌అలీనగర్ 3 కి.మీ. దూరంలో ఉంది. గొత్తికోయ చిన్నారులు పాఠశాలకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్న ఎంఈఓ ఆనంద్‌కుమార్ సమస్యను ఉన్నతాధికారులకు నివేదించారు. ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీఓ వెంకటరమణ, సీఆర్‌పీలు శిరీష, కృష్ణ, బుచ్చయ్య, వి.వెంకటేశ్వరరావు, జయరాం, శంకర్, మహదేవన్ పాల్గొన్నారు.

ఏడుగురిపై కేసు



ఘటనా స్థలంలో విచారిస్తున్న సీఐ అశోక్‌రెడ్డి

అశ్వాపురం: మండల కేంద్రంలో కాలువబజార్‌లో బుధవారం జరిగిన గొడవ, దాడి కేసులో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాలువబజార్‌లో బొల్లం కుమార్ తల్లి ఇటీవల మరణించగా బుధవారం పెద్ద కర్మ నిర్వహించారు. అక్కడికి వచ్చిన కొందరు మద్యం సేవించి గొడవ పడి కుమార్ తండ్రి, బంధువులపై దాడి చేసి గాయపరిచారు. బొల్లం కుమార్ ఫిర్యాదు మేరకు జగ్గారం గ్రామానికి చెందిన నూకల సంపత్, పిండి శ్రావణ్, బాలిన రాజేశ్, నూకల నాగరాజు, నెట్టెం రామకృష్ణపై కేసు నమోదు చేశారు. ఇదే ఘటనలో నూకల నాగరాజు ఫిర్యాదు మేరకు కొత్తగూడెంనకు చెందిన కాటిబోయిన అరవింద్, జంగిలి శ్రీనివాస్‌పై సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్‌ను దూషించిన యువకుడు

అరెస్ట్ చేసిన పోలీసులు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ అధికారిని అసభ్య పదజాలంతో దూషించిన ఘటనలో బుధవారం ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ యయాతిరాజు కథనం ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన చిక్కం గోపాలకృష్ణ భూవివాదంపై ఈ నెల 11వ తేదీన స్థానిక తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణను కలిసి పరిష్కరించాలని కోరాడు. రికార్డులను పరిశీలించి పరిష్కరిస్తానని చెప్పడంతో ఆగ్రహించిన గోపాలకృష్ణ విధుల్లో ఉన్న తహసీల్దార్‌తో వాగ్వాదానానికి దిగాడు. విధులకు ఆటంకం కలిగించాడు. అదే రోజు రాత్రి తనకు ఫోన్లు చేసి అసభ్య పదజాలంతో దూషించినట్లు తహసీల్దార్ ఈ నెల 12వ తేదీన స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోపాలకృష్ణను బుధవారం తెల్లవారుజామున అతని ఇంటి వద్దకు వెళ్లి అదుపులోకి తీసుకొని, కొత్తగూడెం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేధింపుల కేసులో నిందితుడికి జైలు

కొత్తగూడెంటౌన్: అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడిన చుంచుపల్లి మండలం నందతండాకు చెందిన మాలోతు జానకీరామ్‌కు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ బుధవారం మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ తీర్పు చెప్పారు. జూలురుపాడు మండలం బేతాలపాడుకు చెందిన మాలోతు అరుణను 2012 జూన్ 14న చుంచుపల్లి మండలం నందతండాకు చెందిన మాలోతు జానకీరామ్‌కు ఇచ్చి వివాహం చేశారు. కట్నం కింద రూ.4 లక్షలు, ఆరు తులాల బంగారం, ద్విచక్రవాహనం, రూ.50 వేల విలువైన గృహోపకరణాలు అందజేశారు. ఏడాది తర్వాత జానకీరామ్ మద్యం తాగి వచ్చి శారీరకంగా హింసించేవాడని, వేరే పెళ్లి చేసుకుంటానంటూ వేధించడం ప్రారంభించాడని బాధితురాలు జానకీరామ్‌తో పాటు అతని తల్లి సోనా, ఆడబిడ్డ భూక్య విజయ, ఆమె కుమారులు మోహన్, యోగేశ్‌పై జూలురుపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి ఐదుగురిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. 10 మంది సాక్షులను విచారించాక మాలోతు జానకీరామ్‌పై నేరం రుజువుకావడంతో ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. మాలోతు సోని, భూక్య విజయ, భూక్య మోహన్, భూక్య యోగేశ్‌పై నేరం రుజువుకానందున కేసు కొట్టివేశారు. ఏపీపీ విశ్వశాంతి వాదించగా.. జూలురుపాడు ఎస్‌ఐ రవికుమార్, కోర్టు నోడల్, లైజన్ ఆఫీసర్లు ప్రభాకర్, శ్రీనివాస్, పీసీ పి.ఉపేందర్‌రావు సహకరించారు.

యూరియా కోసం రైతుల పాట్లు



రైతువేదిక వద్ద నిరీక్షిస్తున్న రైతులు

పాల్వంచరూరల్: యూరియా కోసం నిత్యం అవస్థ పడుతున్నా అధికారులు మాత్రం కనికరించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని జగన్నాథపురం రైతువేదిక వద్ద మూడు రోజుల క్రితం రైతులకు యూరియా పంపిణీ చేస్తామని చెప్పి ఆధార్‌కార్డు, పాస్ పుస్తకాల జిరాక్స్‌లు తీసుకున్నారు. కానీ, బుధవారం వాటిని తిరిగి రైతులకు ఇవ్వడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూరియా పంపిణీ చేస్తారని ఆశతో ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతువేదిక వద్ద 150 మందికి పైగా పలు గ్రామాలకు చెందిన రైతులు నిరీక్షించారు. కానీ, అధికారులు యూరియా పంపిణీ చేయకుండా తీసుకున్న జిరాక్స్ పత్రాలు ఇచ్చారు. కాగా, యూరియా కోసం వచ్చిన రైతులకు బీఆర్‌ఎస్ నాయకులు కాంపెల్లి కనకేశ్ భోజనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రంజిత్, హర్షవర్ధన్, ప్రసాద్, శోభన్, పుల్లయ్య, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా శస్త్రచికిత్స

కడుపులోని డ్రిల్ బిట్ తొలగింపు



బాలుడు మింగిన స్టార్ డ్రిల్ బిట్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రి వైద్యులు బాలుడు మింగిన స్టార్ డ్రిల్ బిట్‌ను శస్త్రచికిత్స ద్వారా బుధవారం విజయవంతంగా తొలగించారు. సరిహద్దు ఏపీలోని ఎటపాక మండలం చోడవరం గ్రామానికి చెందిన 8 ఏళ్ల గౌతమ్ ఆడుకుంటూ 6 అంగులాల డ్రిలింగ్ మిషన్‌కు సంబంధించిన స్టార్ డ్రిల్ బిట్‌ను గత శనివారం మింగాడు. ఈ విషయాన్ని ఆదివారం ఉదయం తల్లికి చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు ఏరియా వైద్య శాలకు తరలించగా పిల్లల వైద్యుడు రాజశేఖర్‌రెడ్డి పరీక్షించి విసర్జన ద్వారా బయటకు వస్తుందేమోనని రెండు రోజులు వేచిచూశారు. ఈ క్రమంలో బాలుడికి బాగా కడుపులో నొప్పి వస్తుండడంతో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం శస్త్ర చికిత్స నిర్వహించి డ్రిల్ బిట్‌ను తొలగించారు. బాలుడికి శస్త్ర చికిత్స చేసిన వారిలో అనస్థీషియన్, నిఖిత, మల్లేశ్‌దొర పాల్గొన్నారు.

అవినీతే కాటేసింది..!

- అక్రమాలు, నిర్వహణ లోపాలతోనే సొసైటీ పాలకవర్గాలపై వేటు
- నష్టాలను అధిగమించలేకపోవటం మరో కారణం

ఖమ్మంవ్యవసాయం: అవినీతి, అక్రమాలే సహకార సంఘాల పాలక వర్గాలను గద్దె దించాయి. 'కంచే చేను మేసిన చందం'గా జిల్లాలోని పలు సహకార సంఘాల పాలక వర్గాలు బాధ్యతలను విస్మరించాయి. సహకార సంఘాల సభ్యులుగా ఉన్న రైతులు తమ ప్రయోజనాలతో పాటు, సంఘం అభివృద్ధి లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ చేసిన వారి నుంచి సమర్థులుగా గుర్తించిన వారిని సంఘం పాలకులు (డైరెక్టర్లు)గా ఎన్నుకున్నారు. డైరెక్టర్లు సంఘం అభివృద్ధి, రైతుల ప్రయోజనాలు కాపాడుతామని, అవినీతికి తావులేకుండా పాలనను అందిస్తామని ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టారు. వీరు సంఘం చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకొని వారి నాయకత్వాన పాలన సాగించారు. ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో మొత్తం 101 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు 2020 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. ఐదేళ్ల కాలపరిమితి కలిగిన ఈ సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం 2025 ఫిబ్రవరి వరకు ఉండగా, సహకార సంఘాల విభజన తదితర కారణాలతో పాలక వర్గాలకు ఆరునెలల పదవీ కాలాన్ని పెంచారు. ఆ కాలం కూడా ఆగస్టు 14తో ముగియగా, మరో 6నెలల కాలం పాలక వర్గాలకు అవకాశం కల్పించారు. అయితే ఈ ప్రక్రియలో అవినీతి, అక్రమాలు, పారదర్శకత లోపించిన పాలకవర్గాల స్థానాల్లో పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలో ఉన్న 76 సహకార సంఘాల్లో తొలి విడతలో మంగళవారం 38 సంఘాల పాలక వర్గాల కొనసాగింపునకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు సహకార సంఘాల పని తీరు బాగాలేకపోవటం, అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని గుర్తించి ఆయా సంఘాల పాలక వర్గాలను సహకార శాఖ రద్దు చేసింది. ఆయా సంఘాల నిర్వహణకు సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్లను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించారు.

అక్రమాలు, నిర్వహణ లోపాలే కారణం

అవినీతి, అక్రమాలు, నిర్వహణా లోపాల కారణంగా జిల్లాలో ఇప్పటివరకు ఆరు సహకార సంఘాల పాలకవర్గాలను సహకారశాఖ రద్దుచేసింది. ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం సహకార సంఘంలో రుణాల పంపిణీలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు గుర్తించారు. అంతేగాక గతంలో ఈ సంఘంలో ధాన్యం కొనుగోలులో పెద్ద కుంభకోణం చోటుచేసుకుంది. దీనికి తోడు ఈ సంఘం రుణబకాయిల ఫలితాన్ని సాధించలేక ఎన్‌పీఏ జాబితాలోకి చేరింది. దీంతో ఈ సంఘం పాలక వర్గం రద్దయింది. కూసుమంచి మండలంలోని చేగొమ్మ సహకార సంఘం రూ.1.52 కోట్లతో నిర్మించిన రెండు గోదాముల నిర్మాణంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, దీంతో నాణ్యతా ప్రమాణాలు లేకపోవటం, సంఘం నిర్వహణ లోపాల కారణంగా పాలక వర్గాన్ని రద్దు చేశారు. నేలకొండపల్లి సహకార సంఘం దాదాపు రూ.1.50 కోట్ల నష్టాల్లో కూరుకుపోయి ఉంది. బకాయిల వసూలులో విఫలం కావటం, కొందరు డైరెక్టర్లు తీసుకున్న రుణాలు చెల్లించకపవటం తదితర కారణాలతో ఈ సంఘం పాలక వర్గాన్ని రద్దు చేశారు. కల్లూరు సహకార సంఘంలో రూ.3 లక్షల అవినీతి చోటు చేసుకుంది. ఈ అవినీతిని రికవరీ చేయలేకపోవటం, గేదెల రుణాలు, డైరెక్టర్లు అధిక మొత్తంలో రుణ బకాయిలు కలిగి ఉండటం తదితర కారణాలతో ఈ సంఘం పాలక వర్గం రద్దయింది. కల్లూరు మండలంలోని పోచారం సహకార సంఘంలో కూడా అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయి. పాత బకాయిలు పేరుకుపోవటం, డైరెక్టర్లు అధిక మొత్తంలో రుణాలు పొంది చెల్లించకపోవటం వంటి కారణాలతో ఈ సంఘం పాలక వర్గాన్ని రద్దు చేశారు. ఇక తల్లాడ పాలక వర్గం కూడా డైరెక్టర్లు డిఫాల్టర్లుగా ఉండటం, ఈ సంఘంలో అవి నీతి అక్రమాలు చోటు చేసుకోవటంతో పాలక వర్గాన్ని రద్దు చేశారు. ఈ ఆరు సంఘాలతో పాటు జిల్లాలో మరో ఆరు సహకార సంఘాల పాలక వర్గాలను కూడా రద్దు చేసే అంశాన్ని సహకార శాఖ పరిశీలిస్తోంది. సహకార సంఘాల పాలక వర్గాల రద్దు వెనక రాజకీయ ప్రమేయం ఉందనే చర్చ జరుగుతోంది.

ఇన్‌ఫార్మర్ నెపంతో యువకుడి హత్య

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నెపంతో ఓ యువకుడిని దారుణంగా హతమార్చారు. వివరాలిలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలో గల బెంచరం గ్రామానికి వచ్చిన మావోయిస్టులు దుష్మరాం ఓయం (36)ను నిద్ర లేపి బయటకు తీసుకొచ్చి, కత్తులు, గొడ్డళ్లతో నరికి చంపారు. సమాచారం అందుకున్న జంగ్లా పోలీసులు బుధవారం గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని బీజాపూర్‌కు తరలించారు.

చేపల చెరువులో పడి వ్యక్తి మృతి

దుమ్ముగూడెం: మండలంలోని వర్క్‌షాపు గ్రామంలోని చేపల చెరువులో గోవిందాపురం గ్రామానికి చెందిన పొడియం మూర్తి (66) ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గణేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మూర్తి మూడేళ్లుగా చేపల చెరువు వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం నుంచి కనిపించకపోవడంతో చేపల చెరువు యజమాని ముసలి రాంబాబు గాలింపు చేపట్టగా బుధవారం మధ్యాహ్నం చేపల చెరువులో శవమై తేలాడు. చేపలకు మేత వేసే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉంటాడని మృతుడి కుమారుడు బుజ్జిబాబు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

బూర్గంపాడు: సారపాకకు చెందిన వివాహిత బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రసాద్ కేసు నమోదు చేశారు. దుమ్ముగూడెం మండలం గంగోలుకు చెందిన పింగళి శ్రీనివాస్ సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతను తన భార్య నవ్యశ్రీ (28), ముగ్గురు పిల్లలతో కలిసి సారపాకలో నివాసముంటున్నాడు. మంగళవారం రాత్రి తన భార్య నవ్యశ్రీకి ఆరోగ్యం బాగోలేదని సుజాతనగర్‌లోని తన అత్తమామలకు సమాచారమిచ్చాడు. ఆ రాత్రే నవ్యశ్రీని ఓ ఆర్‌ఎంపీ వద్దకు, అక్కడినుంచి భద్రాచలంలోని రెండు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించాడు. చికిత్స పొందుతూ బుధవారం నవ్యశ్రీ మృతి చెందింది. ఒక్కరోజులోనే ఆరోగ్యం క్షీణించి, మృతిచెందడంతో అమ్మాయి తండ్రి, బంధువులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని హడావుడిగా భర్త శ్రీనివాస్ తన స్వగ్రామం తరలించే ఏర్పాట్లు చేసుకున్నాడు. దీంతో మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ ప్రసాద్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి కత్తి తిరుపతయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.